క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

తుని: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజరు కె.కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను 7382781490 నంబరుకు తెలియజేయాలని కోరారు.

వైభవంగా పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లిలోని అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారి క్షేత్రంలో బుధవారం పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు వేద పండితులు రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, పారాయణం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని పూజలు, పారాయణం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ పీఠాధిపతి రమణస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి జయంతి



స్వామివారికి పంచామృతాభిషేకం చేస్తున్న దృశ్యం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామివారి జయంతిని ఉత్సవంగా జరిపారు. బుధవారం పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులచే స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యా ప్రాప్తి ప్రసాదించాలని విద్యార్థుల కొరకు ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థులను ఆశీర్వదించారు. ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నేతలు

ప్రత్తిపాడు రూరల్: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత లభిస్తుందని స్థానిక జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి దొరబాబు అన్నారు. మెట్టచింత గిరిజన గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతల రాజు, రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయండి

రౌతులపూడి: వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం సూర్యకుమారి అన్నారు. బుధవారం మహిళా సమాఖ్య భవనంలో వీఓఏలు, సీసీలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వివిధ లీడ్‌బ్యాంకులు ద్వారా తీసుకున్న ఎస్‌హెచ్‌జీ రుణాలు, సెర్ప్ ఆధీనంలో డీఆర్‌డీఏ ద్వారా తీసుకున్న శ్రీనిధి, ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్, వెలుగు రుణాలు సకాలంలో చెల్లించాలని, పొదుపు ఎప్పటికప్పుడు యథావిధిగా కొనసాగించాలని, ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వివిధ రాయితీలు ప్రజలకు అవగాహన కల్పించాలని వీఓఏలకు సూచించారు. గ్రామాల్లోని డ్వాక్రా సంఘాలు ఆర్థికాభివృద్ధికి వీఓఏలు కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు సరస్వతి, ప్రకాశమ్మ, అప్పారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

ఏలేశ్వరం: ఇటీవల పాముకాటుకు గురైన ఉపాధికూలీ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. లింగంపర్తి గ్రామానికి చెందిన మద్దిల రాము(61) ఉపాధి పనులు చేస్తుండగా గత నెల 19వ తేదీన పాముకాటుకు గురయ్యాడు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తెలిపాడు.

సారా బట్టీపై దాడులు

గోకవరం: కామరాజుపేట గ్రామంలో సారా బట్టీపై బుధవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. కోరుకొండ ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది బట్టీపై దాడి నిర్వహించి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని గేది సింహాద్రి, గుత్తుల చంద్ర అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించామన్నారు.

ఖరీఫ్‌పై వరుణుడి కన్నెర్ర



ఎ.కొత్తపల్లిలో ఏఓ పర్యవేక్షణలో ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వీఏఏ



హంసవరంలో వీఏఏ చేస్తున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ బుల్లిబాబు

- మందకొడిగా ఖరీఫ్ పనులు
- ముందుకు సాగని ఈ-క్రాప్ బుకింగ్
- సాధారణ సాగులో 26.45 శాతం
- ఖరీఫ్ వరిలో 13.15 శాతం నమోదు
- పంటల బీమా, పంట రుణాలకు ఈ-క్రాప్ బుకింగ్ కీలకం

తుని రూరల్: ఖరీఫ్ సాగుపై వరుణుడు కన్నెర్రజేశాడు. వర్షాలు సక్రమంగా కురవక సాగునీరందక పనులు మందకొడిగా జరుగుతున్నాయి. దీనివల్ల పంటల బీమా, పంట రుణాలకు ఆధారమైన ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ (పంట నమోదు కార్యక్రమం) ముందుకు సాగడంలేదు. తొలకరి నుంచి వాతావరణం అనుకూలించకపోవడంతో ఖరీఫ్ పనుల్లో జాప్యం ఏర్పడుతోంది. వరుణుడు కరుణించకపోగా వివిధ ప్రాజెక్టుల నుంచి ఆశించిన స్థాయిల్లో సాగునీరు పంట పొలాలకు చేరడంలేదని రైతులు వాపోతున్నారు. సాగునీరు అందకపోవడంతో ఖరీఫ్ ప్రధాన పంటలైన వరి, కూరగాయలు, మొక్కజొన్న, ఇతర ఉద్యాన పంటల నాట్లు ఆలస్యమయ్యాయి. దీని ప్రభావం ఈ-క్రాప్ బుకింగ్‌పై పడుతోంది. పంటలు వేసిన తర్వాతే ఈ-క్రాప్ బుకింగ్ చేయాల్సి ఉంది. తుని సబ్ డివిజన్ పరిధిలో సాధారణ సాగు 92,327 ఎకరాలు. ఇందులో 24,426 (26.45శాతం) ఈ-క్రాప్ బుకింగ్ అయ్యింది. ఖరీఫ్‌లో సాధారణ వరిసాగు 38,658 ఎకరాలకు గాను ఈ-క్రాప్ బుకింగ్ 5,087 ఎకరాల్లో (13.51శాతం) పూర్తయినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. మెట్ట ప్రాంతమైన తుని సబ్‌డివిజన్ ఐదు మండలాల్లో ఇప్పటి వరకు 26 శాతానికి పైగా లోటు వర్షపాతం నమోదైనట్టు పేర్కొన్నారు. వర్షాలు కురవడం, ఏలేరు, పంపా, తాండవ ప్రాజెక్టులతోపాటు పీబీసీ, పుష్కర కాలువల ద్వారా సాగునీరు చేరితే నాట్లు పడే అవకాశం ఉంది. నాట్లు వేసిన తర్వాత ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తవనుంది.

సాధారణ, ఖరీఫ్ వరిసాగు, పూర్తయిన ఈ-క్రాప్ బుకింగ్ వివరాలు

మండలం	సాధారణ సాగు	పూర్తయిన ఈ-క్రాప్ బుకింగ్	సాధారణ వరిసాగు	పూర్తయిన ఈ-క్రాప్ బుకింగ్
తుని	22,615	7,343	6,600	698
కోటనందూరు	16,289	3,509	9,575	1,072
రౌతులపూడి	18,174	4,988	5,273	340
శంఖవరం	13,734	4,388	3,605	324
తొండంగి	21,515	4,198	13,605	2,653

పంటల బీమా, రుణాలకు ఈ-క్రాప్ బుకింగ్ కీలకం

పంట రుణాలకు, పంటల బీమా వర్తింపునకు, గిట్టుబాటు ధర, ప్రభుత్వ సాయం పొందేందుకు ఈ-క్రాప్ బుకింగ్ ఎంతో కీలకం. ప్రకృతి వైపరీత్యాలతో అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు సాగుదారులకు ఈ-క్రాప్ బుకింగ్ ఆధారంగా బీమా కంపెనీలు నష్టపరిహారం అందిస్తాయి. ప్రభుత్వ సాయం అందించాలన్నా ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిగణంలోకి తీసుకుంటారు. గడువు ఉన్నప్పటికీ వరినాట్లు వేయకపోవడంతో గ్రామస్థాయిలో ఉన్న వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్ అసిస్టెంట్లు ఈ-క్రాప్ బుకింగ్ చేయలేకపోతున్నారు.

> **ప్రతి పంటకు ఈ-క్రాప్ బుకింగ్**
>
> సబ్‌డివిజన్‌లో ప్రతి పంటకు ఈ-క్రాప్ బుకింగ్ చేస్తాం. తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యటించి నాట్లు వేసిన భూముల్లో ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. పంట వేసినా నమోదు కాకపోతే రైతులు వెంటనే స్పందించి సంబంధిత వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలను సంప్రదించాలి. పంట నమోదైతేనే పంట రుణం, పంటల బీమా, పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుంది. అదును పదునూ చూసి వరినాట్లు వేయాలి. సాగునీటి వసతులు లేకపోతు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి.
>
> – సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

పార్టీ విజయానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సూర్యకుమార్

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయం సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ అన్నారు. పట్టణంలోని 6, 7 సచివాలయాల పరిధిలో బుధవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ వెళ్లి వివరించే బాధ్యత గృహసారథులపై ఉందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సీఎం జగన్ మళ్లీ అధికారం చేపట్టే వరకూ నిరంతరం శ్రమించాలన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి అలమండ వీర రాఘవ స్వామి, కౌన్సిలర్ దోశ కిషోర్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, కోరాడప్రసాద్, కాకాడ నాగేశ్వరరావుతదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో చేరువైన వైద్యం



అచ్చంపేటలో రోగులకు పరీక్షిస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. అచ్చంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. కౌమార దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత ఉంటే పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు వెళ్లి చిన్నారులను పరీక్షించారు. ప్రస్తుతం వర్షకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. 60 మంది సాధారణ రోగులు, 10 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 50 మంది మధుమేహ బాధితులు, 60 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి సేవలు అందించామని వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు.

150 మందికి వైద్య పరీక్షలు

రౌతులపూడి: ఎస్.పైడిపాలలో తమ్మయపేట రిఫరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు జిగిరెడ్డి సత్తిబాబు, రాయి ప్రసాద్ ప్రారంభించారు. ఆసుపత్రి వైద్యులు డి.ప్రసాద్, జె.విష్ణు 150 మంది రోగులను పరీక్ష చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీపౌర్ణమి వేడుకలు



సోదరునికి రాఖీ కడుతున్న సోదరి

ఏలేశ్వరం: అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీపౌర్ణమిని బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అన్నలకు చెల్లెలు, తమ్ముళ్లకు అక్కలు రాఖీలు కట్టడంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. అన్నలకు చెల్లెళ్లు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఉదయం నుంచే రాఖీలు చేతబట్టుకుని చెల్లెళ్లు సందడి చేశారు. రాఖీలు కట్టిన చెల్లెళ్లకు అన్నలు తగిన బహుమతులు అందజేశారు. పట్టణంలో యువకులకు యువతులు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. ప్రతిఏడాది రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదర భావం పెంపొందించుకోవాలని తల్లిదండ్రులు పిల్లలను దీవించారు. ఏలేశ్వరం పట్టణంలో వైఎస్సార్ సీపీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు సామంతుల హైమావతి, కోరాడ రామలక్ష్మి రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు. కౌన్సిలర్ కోరాడ రామలక్ష్మి మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్‌కు రాఖీ కట్టి సోదరభావం చాటుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత కోరాడప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు: మండలంలో రాఖీ పండగను ఘనంగా జరుపుకొన్నారు. ప్రత్తిపాడులోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో బుధవారం రాఖీ మహోత్సవాన్ని బ్రహ్మకుమారీలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ శేరు కృష్ణ, మినర్వా విద్యా సంస్థల అధినేత డీవీఎస్ రమేష్‌రాజు తదితరులతో పాటు స్థానిక మండల పరిషత్, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, అగ్నిమాపక కేంద్రం, పోలీస్ స్టేషన్, జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, గ్రామ సచివాలయాలు తదితర ప్రభుత్వ కార్యాలయాలకు బ్రహ్మకుమారీలు వెళ్లి అధికారులకు, సిబ్బందికి రాఖీలు కట్టారు. బ్రహ్మకుమారీలు తులసి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వైఎస్సార్ సీపీ నేత సూర్యకుమార్‌కు రాఖీ కడుతున్న కౌన్సిలర్ కోరాడ రామలక్ష్మి



ప్రత్తిపాడు ఎంపీపీ కాంతి సుధాకర్ చేతికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి తులసీ

సీఎం జగన్‌కు స్వాగతం





గోకవరం మండలం ఇర్రిపాక గ్రామంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దంపతులు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు



తుని 16వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీపీ సుధారాణి

తుని: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. బుధవారం 16వ వార్డులో కౌన్సిలర్ కస్తూరి మంగ ఆధ్వర్యంలో మున మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ సుధారాణి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజుకు సూచించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కౌన్సిలర్లు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

పంట నమోదు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు

తుని రూరల్: ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కాకినాడ జిల్లా ఉద్యాన అధికారి ఎస్.మల్లికార్జునరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తుని, తొండంగి, కోటనందూరు మండలాలకు చెందిన వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏల సమావేశం హెచ్ఓ గుత్తుల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ లక్ష్యానికి అనుగుణంగా పంట నమోదు చేయాలన్నారు. ఆర్‌కేవీవై, మైక్రో ఇరిగేషన్ లక్ష్యాలను, ఆయిల్‌పామ్ తోటల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

శంఖవరం: తెగుళ్ల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి ఎస్.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం–3లో శంఖవరం, రౌతులపూడి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట నమోదు ప్రక్రియపైన, ఉద్యానవన పంటలకు వచ్చే తెగుళ్లు, పురుగుల నివారణపై క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్రిప్, స్ప్రింక్లర్, కొబ్బరి, జీడిమామిడి విస్తరణ పథకంపై అవగాహన కల్పించారు. తేటగుంట ఉద్యానవన నర్సరీలో కొబ్బరి రూ.60, మామిడి రూ.40 లకు రైతుల కోసం అందుబాటులో ఉంచినట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.గాంధీ, ఉద్యానవన అధికారి పి.అరుణ్‌కుమార్, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

కాంప్లెక్స్, క్లస్టర్ల ఏర్పాటుతో క్రీడలకు మహర్దశ



క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న పీడీ, పీఈటీలు

తుని రూరల్: గ్రామస్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అనువుగా రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పీడీ, పీఈటీ స్కూల్ కాంప్లెక్స్, క్లస్టర్లతో క్రీడలకు మహర్దశ రానుందని నియోజకవర్గ కోఆర్డినేటర్ పి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. బుధవారం ఎస్.అన్నవరంలో జెడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన తుని, తొండంగి, కోటనందూరు మండలాల పీడీ, పీఈటీల కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తొలిసారి ఏపీలో పీడీ, పీఈటీ కాంప్లెక్స్, క్లస్టర్లను ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో రాణించేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పీడీ, పీఈటీలపై ఉందన్నారు. విద్యార్థులు ఆటలపై ఆసక్తి కలిగి ఉంటే ఆరోగ్యంగా ఉండడానికి శారీరక మానసిక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్రీడాకారులు లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందుకు పదవీ విరమణ చేసిన పీడీల సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. పదవీ విరమణ చేసిన సీనియర్ పీడీ కేఎస్ జాబేజ్, వ్యాయమ ఉపాధ్యాయులు బి.గోపాలరావు, ఎస్.జాన్ విక్టర్, కె.నరసింహమూర్తి పలు సూచనలు చేశారు.

వచ్చే నెల 4న వేమవరం ఉపసర్పంచ్ ఎన్నిక

తొండంగి: వేమవరం పంచాయతీ ఉపసర్పంచ్ రాజీనామా కారణంగా నూతన ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 4 జరుగుతుందని ఎంపీడీఓ పసపులేటి సతీష్ బుధవారం తెలిపారు. వేమవరం ఉపసర్పంచ్ జి.గోపి రాజీనామా చేయడంతో మళ్లీ ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలిచ్చింది. ఈ మేరకు ఎన్నికల అధికారిగా కె.వి.సూర్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులిచ్చిందని ఎంపీడీఓ సతీష్ వివరించారు. ఈ మేరకు 4న ఉదయం 11 గంటలకు వేమవరం పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సి.రాయవరంలో పొలంబడి

ఏలేశ్వరం: సి.రాయవరంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి బి.జ్యోతి ఆధ్వర్యంలో రైతులకు పొలంబడి కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై చార్ట్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి నమూనాలు సేకరించడంతో చేపట్టవల్సిన సస్యరక్షణ చర్యలు తీసుకోవచ్చొన్నారు. విత్తనశుద్ధి చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. మిత్ర, శత్రుపురుగులు సేకరించి వాటి నిష్పత్తి 2:1 ఉంటే పురుగు మందులు కొట్టకూడదన్నారు. కాండం తొలుచుపురుగు, ఆకుముడత పురుగును గుడ్డుదశలో వేపనూనె ద్వారా అరికట్టవచ్చొన్నారు. ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమరభేరి కరపత్రాల పంపిణీ



ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తుని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం చేపట్టిన సమర భేరిని జయప్రదం చేయాలని ఎస్.శ్రీనివాస్ కోరారు. బుధవారం నుంచి వచ్చె నెల 4వ తేదీ వరకూ నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా తుని గొల్లఅప్పారావు సెంటర్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రూ కాప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.3 వేల కోట్ల భారం మోపారన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా చేపట్టిన కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కామేశ్వరి, రమేష్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ



నివేదిని అభినందిస్తున్న కరస్పాండెట్ వీరబాబు

ప్రత్తిపాడు రూరల్: లంపకలోవకు చెందిన విద్యార్థి మద్దినాల నివేది జవహర్ నవోదయ విద్యాలయం 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో మెరిట్‌లిస్టులో 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించినట్లు సంస్థ కరస్పాండెంట్ సుంకర వీరబాబు తెలిపారు. నివేదిని శ్రీభారతి విద్యానికేతన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సుంకర వీరబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

దస్తావేజు లేఖర్ల నిరసన

ప్రత్తిపాడు: ఇటీవల ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల విధానంలో ప్రైమ్ 2.0ను ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ స్థానిక సెబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బుధవారం దస్తావేజు లేఖర్లు నిరసన చేపట్టారు. బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్న పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖర్ల సంఘ నాయకులు పంచదార్ల నాగేశ్వరరావు, అత్తి ఉమామహేశ్వరరావు, చిలకమర్తి వెంకటరమణ, ఈర్లంకి రాంబాబు, మదినే దొరబాబు, మంచికంటి భారతి, పంచదార్ల రాంబాబు, సుందరి, రాయవరపు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండూరులో ఢిల్లీ బృందం పర్యటన

సామర్లకోట: ఢిల్లీ నుంచి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం బుధవారం విస్తరణ శిక్షణ కేంద్రంలో మొక్కలను పరిశీలించారు. వర్మీ కంపోస్టు యూనిట్లు, మునగ మొక్కల పెంపకంపై ఫ్యాకల్టీలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని ఉండూరు గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, యూనిట్‌లో ప్లాస్టిక్ రీ సైక్లింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సచివాలయంను సందర్శించి అందులోని సేవలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా వేంకటేశ్వరుని పవిత్రోత్సవాలు

పిఠాపురం: గ్రామంలో పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి పవిత్రోత్సవాల్లో భాగంగా తొలిరోజు అంకురార్పణ నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేవారు. అనంతరం పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ పి.వెంకటయ్య, సూపరిండెండెంట్ రామచంద్రరావు, ఆలయ అధికారి ఎం.సందీప్, అర్చకులు పి.రామకృష్ణాచార్యులు, పి.నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సారాతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైక్, సారా, నిందితుడితో ప్రత్తిపాడు ఎస్ఈబీ సిబ్బంది

ప్రత్తిపాడు: పెదశంకర్లపూడిలో స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) బుధవారం దాడులు నిర్వహించారు. గ్రామంలో బైక్‌పై అక్రమంగా సారా తరలిస్తున్న పిల్లి గంగరాజును అరెస్టు చేసి, బైక్‌తో పాటు 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. నిందితుడి సారా బట్టీపై దాడి చేసి, వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న కిర్లంపూడి మండలం గోనేడ గ్రామానికి చెందిన పోలారపు చెల్లయ్యమ్మపై కేసు నమోదు చేశామన్నారు. పెదశంకర్లపూడిలో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఎర్ర శ్రీను, బత్తిన సిద్దూ, సూరంపూడి రమణలపై కేసులు నమోదు చేశామన్నారు. ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

పాడి రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: పాడి రైతులు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ అన్నారు. రుణ మేళా కార్యక్రమంలో భాగంగా అమినాబాద్, కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం పాడిరైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు పాలు పోసే రైతులకు ఒక్కో గేదెకు రూ.35 వేలు చొప్పున దాణా కొనుగోలు, షెడ్లు వేసుకునేందుకు జిల్లా సహకార బ్యాంకు ద్వారా రుణాలను మంజూరు చేశారన్నారు. దీని కోసం గ్రామాల్లో పాడి రైతులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించి దరఖాస్తులు తీసుకున్నారని తెలిపారు. ఇప్పటి వరకు వంద మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.